


మన
# భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం




మంగళవారం 7 జూలై 2026 ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం పేజీలు :- 3

# ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలి





**-రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి**

భానుపురి /సూర్యాపేట కలెక్టరేట్

ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువుల్లో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. జిల్లా సమీకృత కలెక్టరేట్ (ఐ.డీ.ఓ.సీ) నుంచి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ దాదాపు పూర్తయిందని, రాష్ట్రవ్యాప్తంగా రేపటిలోగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీని 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు.ఇళ్లకు వెళ్లిన సమయంలో తాళం వేసి ఉంటే వాటిని 'అబ్సెంట్'గా నమోదు చేయాలని, అవసరమైతే తర్వాత మరోసారి సందర్శించి ఫారాలను అందజేయాలని సూచించారు. పంపిణీ చేసిన ప్రతి ఎన్యుమరేషన్ ఫారాన్ని బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) తిరిగి సేకరించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా డిజిటలైజేషన్ ప్రక్రియను రాష్ట్రవ్యాప్తంగా వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. తప్పుడు సమాచారం అందిస్తే RP Act ఒవఫ్ఙఅశీఅ 31 ప్రకారం చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాన్ని ఎలా పూరించాలో వివరించడంలో ఇబ్బంది పడుతున్న బీఎల్‌వోలకు సూపర్‌వైజర్లు సహకరి ంచాలని, ఎన్నికల నమోదు అధికారులు (ఈఆర్‌వోలు) సూపర్‌వైజర్ల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అవసరమైన చోట అనుభవం ఉన్న వాలంటీర్లను నియమించి బీఎల్‌వోలకు సహకారం అందించాలని తెలిపారు. ప్రతి ఓటరికి ఒక ఎన్యుమరేషన్ ఫారాన్ని అందజేసి, పూరించిన ఫారాన్ని మాత్రమే తిరిగి తీసుకోవాలని, రెండు ఫారాలను ఒకేసారి తిరిగి తీసుకుంటున్నారనే వార్తలు వస్తున్నాయని, అలాంటి విధానం ఎట్టి పరిస్థితుల్లోనూ అనుసరించరాదని స్పష్టం చేశారు. పూరించిన ఎన్యుమరేషన్ ఫారాలపై తప్పనిసరిగా ఓటర్ల సంతకాలు ఉండేలా చూడాలని ఆదేశించారు. ఎన్యుమరేషన్ ఫారాలను బీఎల్‌వోలు మాత్రమే పంపిణీ చేయాలని, రాజకీయ పార్టీల ప్రతినిధులు లేదా బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏలు) ఫారాలను పంపిణీ చేయరాదని స్పష్టం చేశారు. అయితే ఓటర్ల చిరునామాలను గుర్తించడంలో మాత్రమే బీఎల్‌ఏలు బీఎల్‌వోలకు సహకరించవచ్చని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ఎస్ఐఆర్ పనులను మరింత వేగవంతం చేసి నిర్దేశించిన గడువుల్లో పూర్తి చేయాలని, అదే సమయంలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్) ప్రక్రియను కూడా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ 98.4 శాతం పూర్తయిందన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ బి హరి సింగ్, డిఆర్వో ప్రేమ్ రాజ్, సూర్యాపేట, కోదాడ, హుజూర్నగర్ వేణు మాధవరావు, సూర్యనారాయణ, శ్రీనివాసు లు, తహసిల్దార్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీలో వేగం పెంచాలి

**- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

భానుపురి /సూర్యాపేట కలెక్టరేట్

జిల్లాలో హరితహారం కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని, ప్రతి ఇంటికీ ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారంపై కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. హరితహారంలో భాగంగా ఇచ్చే మొక్కలు అన్ని రకాలు ఉండేలా చూడాలని, ప్రజలు నాటుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా ఊరూరా పచ్చదనం పరుచుకోవాలని పిలుపునిచ్చారు. అధికారులు, ఉద్యోగులు సమన్వ యంతో పనిచేసి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. కేవలం మొక్కలు నాటడమే కాదు.. వాటిని కంటికి రెప్పలా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పంచాయతీ రాజ్, మున్సిపాలిటీలు, అటవీ శాఖ, వ్యవసాయం, నీటి పారుదల శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని కలెక్టర్ సూచించారు. ఖాళీ ప్రదేశాలు ఎక్కడ ఉన్నా మొక్కలు నాటేందుకు సిద్ధం చేయాలన్నారు. స్కూళ్లలో పండ్ల మొక్కలు, హాస్టళ్లలో స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని, విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించేలా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టల్ పరిసరాల్లో ఎకో క్లబ్ లను యాక్టివేట్ చేసి మొక్కల సంరక్షణ బాధ్యతను అప్పగించాలని సూచించారు. కేవలం ప్రభుత్వ కార్యాలయాలే కాకుండా పెట్రోల్ బంకులు, రైస్ మిల్లులు, పరిశ్రమలు కూడా ఈ వనమహోత్సవంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఇండస్ట్రీ మేనేజ్‌మెంట్ తమ పరిసరాల్లో మెగా ప్లాంటేషన్ డ్రైవ్ చేపట్టాలని స్పష్టం చేశారు. మొక్కలు నాటడంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. మొక్కల పంపిణీకి



సంబంధించి మున్సిపల్ అధికారులు ముందస్తు ప్లానింగ్‌తో ఉండటంపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. పోస్టర్లు, ప్రచార చిత్రాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న తీరు బాగుందని మెచ్చుకున్నారు. ఇదే ఉత్సాహంతో క్షేత్రస్థాయిలో పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.కార్యక్రమం లో అదనపు కలెక్టర్ బి.హరి సింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జడ్.పి. సిఇఓ శిరీష, హౌసింగ్ పిడి సిద్ధార్థ్, డిఎంహెచ్ఓ వెంకటరమణ డిపిఓ యాదగిరి, సిపిఓ కిషన్, డిఎఓ శ్రీధర్ రెడ్డి, డిఎఫ్ ఓ దామోదర్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ పేరుతో మొక్కను నాటండి

భానుపురి /సూర్యాపేట కలెక్టరేట్

పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్.పర్యావరణ పరిరక్షణ, హరితహారం విస్తరణ, విద్యార్థుల్లో ప్రకృతి పట్ల బాధ్యతను పెంపొందించే లక్ష్యంతో తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ , జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న "ఏక్ పెడ్ మా కే నామ్ (అమ్మ పేరుతో మొక్కను నాటడం) జాతీయ విద్యార్థి పర్యావరణ పోటీ కార్యక్ర ˇమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి తన తల్లి పేరుతో ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. "ఏక్ పెడ్ మా కే నామ్" కార్యక్రమం ద్వారా పచ్చదనాన్ని పెంపొంది ంచడంతో పాటు ప్రకృతి పట్ల ప్రేమ, బాధ్యతాభావం పెరుగుతుందని తెలిపారు. ప్రతి పాఠశాలలో కనీసం 10 పండ్ల మొక్కలు ఇతర మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఈ జాతీయ స్థాయి పర్యావరణ పోటీని తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్ర ˇమంలో భాగంగా విద్యార్థులు, కళాశాల విద్యార్థులు, పరిశో ధకులు, సాధారణ పౌరులు మొక్కలు నాటడం, సీడ్ బాల్స్ తయారీ, పర్యావరణ అవగాహన కార్యక్రమాలలో పాల్గొని తమ ఫోటోలను అప్‌లోడ్ చేయడం ద్వారా పోటీలో పాల్గొనవచ్చని వివరించారు.ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కల నాటడం చేపట్టి "హరిత సూర్యాపేట " నిర్మాణానికి అందరూ సహకరిం చాలని అధికారులు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి అశోక్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ఈ కార్యక్రమంలో విస్తృతంగా పాల్గొనేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణను విద్యార్థుల దైనందిన జీవితంలో భాగంగా మార్చేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగప డుతుందని పేర్కొ న్నారు. జిల్లాలోని ప్రతి విద్యాసంస్థ ఈ



కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమం గురించి మరింత సమాచారానికి ఎన్ జి సి జిల్లా కోఆర్డినేటర్ లామ్ దేవరాజు ను సంప్రదించగలరు. కార్యక్రమం లో అదనపు కలెక్టర్ బి.హరి సింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జడ్.పి. సిఇఓ శిరీష, హౌసింగ్ పిడి సిద్ధార్థ్, డిపిఓ యాదగిరి, సిపిఓ కిషన్, డిఎఓ శ్రీధర్ రెడ్డి, డిఎఫ్ ఓ దామోదర్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# పోలీస్ గ్రీవెన్స్ డేలో బాధితుల పిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పి నరసింహ



భానుపురి /సూర్యాపేట ఎస్పీ కార్యాలయం

సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పి నరసింహ పిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితులు వివిధ సమస్యలపై ఫిర్యాదులకు సంబంధించి బాధితులు ఎస్పి ని ప్రత్యక్షంగా కలిసి వినతులు సమర్పించారు.ఈ సందర్భంగా ఎస్పి ప్రతి ఒక్క బాధితుడి సమస్యను విని, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ అధికారులుతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా, వారి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అలాగే, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఎస్పి తెలిపారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# శ్రీ వాసవి సేవాసమితి కార్యాలయం కు ఫ్యాన్ బహుకరణ

## ప్రతి ఒక్కరూ సమాజ సేవకులకు తోడ్పాటు నందించాలి



భానుపురి /సూర్యాపేట టౌన్

ప్రతి ఒక్కరు సమాజసేవలో పనిచేసే సేవకులకు తోడ్పాటు నందించాలని శ్రీ వాసవి సేవా సమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం తెలిపారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రం లోని గాంధీ విగ్రహం వద్ద గల శ్రీ సాయి తేజ ఎలక్ట్రానిక్స్ అధినేత,శ్రీ వాసవి సేవాసమితి సభ్యులు గోరంట్ల శ్రీనివాస్ తనయుడు గోరంట్ల సాయి తేజ పుట్టిన రోజు సందర్భంగా శ్రీ వాసవి సేవాసమితి కార్యాలయం కు సీలింగ్ ఫ్యాన్ బహూకరించారు. ఈ సందర్భంగా వారు సాయి తేజ తన పుట్టిన రోజు ను పురస్కరించుకొని ఆర్భాటము లేకుండా శ్రీ వాసవి సేవాసమితి స్వచ్ఛంద సంస్థ కార్యాలయం కు సీలింగ్ ఫ్యాన్ బహుకరించడం అభినంద నియమని తెలిపారు.ప్రతి ఒక్కరు తమకు తోచిన రీతిలో స్వచ్ఛంద సంస్థలకు సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. ఈ కార్య క్రమంలో శ్రీ వాసవి సేవాసమితి సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరశెట్టి నాగరాజు కోశాధికారి సోమ ప్రవీణ్ కుమార్, సభ్యులు గోరంట్ల శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

## స్వరూప రాణి సేవలు ఆదర్శనీయం

భానుపురి/సూర్యాపేట టౌన్



30 వసంతాల సుదీర్ఘ విద్యా సేవలందించి, ఉద్యోగ విరమణ పొందిన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయురాలు స్వరూప రాణి, భావితరాల ఉపాధ్యాయులకు మార్గదర్శకమని శాసనమండలి సభ్యులు, ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం స్థానిక ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో జరిగిన ఎస్ స్వరూప రాణి ఉద్యోగ విరమణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఘనంగా సన్మానించి ఆమె సేవలను కొనియాడారు. ఇంకా ఈ కార్యక్రమంలో విశ్రాంత అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గోవర్ధన్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు గుండా రమేష్, పిఆర్టియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తంగెళ్ల జితేందర్ రెడ్డి, తీగల నరేష్ , జమాల్ షరీఫ్ , సోమ సురేష్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు పి శైలజ, డి అనిత, రేణుక, సంఘ నాయకులు షేక్ బషీర్, గిరి ప్రసాద్, పుదీనా రవీందర్, డైట్ ప్రిన్సిపాల్ ఎస్ సత్యనారాయణ, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్ రవీందర్, గిరి ధర్, గౌరవ అతిధులుగా విశ్రాంత అధ్యాపకులు వై నరసయ్య, హమీద్ ఖాన్, ఎం గోపాల కిషన్ తదితరులు హాజరైనారు.

# ఘనంగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి

భానుపురి /సూర్యాపేట టౌన్



డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రం లోని సూర్యాపేట జిల్లా బీజేపీ కార్యాలయంలో బిజెపి నాయకులు వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంగరాజు రుక్మారావు, బీజేపీ టీచర్స్ సెల్ రాష్ట్ర కోకన్వీనర్ తీకుళ్ళ సాయిరెడ్డి,రాష్ట్ర నాయకులు బూర మల్సూర్ గౌడ్ లు మాట్లాడుతూ డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ స్వతంత్ర భారతదేశ తొలి కేంద్ర మంత్రివర్గంలో పరిశ్రమలు, సరఫరాల శాఖ మంత్రిగా సేవలందించిన గొప్ప జాతీయవాది అని పేర్కొన్నారు. దేశ సమగ్రత, జాతీయవాదం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు. భారతీయ జనసంఘ్‌ను స్థాపించి భారత రాజకీయాలకు జాతీయవాద సిద్ధాంతాన్ని దిశానిర్దేశం చేసిన గొప్ప మహోన్నత నాయకుడని కొనియాడారు. జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, "ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు, రెండు జెండాలు ఉండకూడదు" అనే చారిత్రాత్మక నినాదంతో దేశ ఏకత్వం కోసం ఆయన నిరంతరం పోరాడారని తెలిపారు. ఆ ఉద్యమంలో భాగంగా జమ్మూ కాశ్మీర్‌కు వెళ్లిన సమయంలో అరెస్టై, 1953 జూన్ 23న నిర్బంధంలోనే ప్రాణత్యాగం చేశారని తెలిపారు.దేశ సమగ్రత కోసం ఆయన చేసిన త్యాగం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొ న్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయక త్వంలోని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగం లో జమ్మూ కాశ్మీర్‌కు సంబంధించిన 370 ప్రత్యేక నిబంధనలను రద్దు చేయడం ద్వారా డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ సంకల్పాన్ని కార్యరూపంలోకి తీసుకువచ్చిందని, ఇది దేశ సమైక్యతను మరింత బలోపేతం చేసిన చారిత్రాత్మక నిర్ణయమని కొనియాడారు. దేశంలోనే అతిచిన్న వయస్సులో వైస్ ఛాన్స్ లర్ అయ్యారని, నేటి ఐ ఐ టి ల స్థాపనలో అయన కృషి మరువలేనిదని అన్నారు.యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని దేశరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశభక్తి, త్యాగం, జాతీయ సమగ్రత పట్ల ఉన్న అంకితభావం ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని, వారి ఆశయాలను ఆచరణలో కొనసాగించడమే వారికి నిజమైన నివాళి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లమళ్ళ నర్సింహా, దళితమోర్చ జిల్లా అధ్యక్షులు పరుశరామ్, రవివర్మ, దాసరి వెంకన్న యాదవ్,కోడి లింగయ్య, తన్నీరు వాసుదేవ్, రామచంద్రర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వాసవి సేవా సమితి వనపర్తి మహిళా కమిటీ ఎన్నిక






భానుపురి /వనపర్తి

శ్రీ వాసవి సేవాసమితి వనపర్తి మహిళా కమిటీ ని ఏర్పాటు చేసినట్లు శ్రీ వాసవి సేవాసమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పూరి సురేష్ శెట్టి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ శ్రీ వాసవి సేవాసమితి వనపర్తి జిల్లా మహిళా కార్యదర్శిగా సరిత, సంయుక్త కార్యదర్శిగా చెవ్వ వరలక్ష్మి కార్యవర్గ సభ్యులుగా కొండూరు వినీల, రాముని పుష్పలతను నియమించినట్లు తెలిపారు. త్వరలో శ్రీ వాసవి సేవా సమితి వనపర్తి పూర్తి కమిటీ ని వేసి ప్రమాణ స్వీకారానికి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నియామకమైన మహిళలు మాట్లాడుతూ శ్రీ వాసవి సేవా సమితి ద్వారా చేయు సేవా కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. నియామకానికి సహకరించిన జాతీయ అధ్యక్షులు పూరి సురేష్ శెట్టికి ధన్యవాదాలు తెలిపారు.

## సమాజ సేవకులు రాచర్ల కమలాకర్ పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం



భానుపురి/సూర్యాపేట టౌన్

సమాజ సేవకులు,లయన్స్ కంటి హాస్పిటల్ వైస్ ఛైర్మన్,జిల్లా ఆర్య వైశ్య మహాసభ ఉపాధ్యక్షులు రాచర్ల కమలాకర్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం శ్రీ వెంకట లక్ష్మి హీరో షో రూమ్ వద్ద పేద ప్రజలకు అన్నప్రసాద వితరణ చేయడం జరిగింది.లయన్స్ కంటి హాస్పిటల్ వద్ద హాస్పిటల్ లో పని చేస్తున్న ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు యాదా కిరణ్ జోన్ చైర్మెన్ మిర్యాల సుధాకర్ రీజియన్ చైర్మెన్ తోట శ్యాంప్రసాద్ హీరో షో రూమ్ స్టాఫ్ జైపాల్ రెడ్డి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు..

## రామకృష్ణ మఠం వారిచే వైద్య శిబిరం



భానుపురి /సూర్యాపేట టౌన్

నిస్వార్థ సేవ పవిత్ర సేవ అనే సంకల్పంతో సూర్యాపేట పట్టణంలో రామకృష్ణ మఠం హైదరాబాద్ వారిచే గ్రామ శ్రీ సేవ లో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహించబడింది. మానవసేవే మాధవసేవ అని ప్రవచించిన జగద్గురువు స్వామి వివేకానంద బోధనలకు అనుగుణంగా ఈ నిస్వార్థ సేవ నిర్వహించడం జరిగింది. ఈ ఆరోగ్య శిబిరంలో వివిధ రకాల అవస్థలు పడుతున్న ప్రజలు తమ జబ్బులను వైద్యులకు విన్నవించుకున్నారు. ఈ శిబిరంలో ఉచితంగా డాక్టర్లు సేవలు అందించడమే కాకుండా బీపీ, షుగర్ మొదలగు బ్లడ్ టెస్ట్ లు ఉచితంగా చేసి ఉచితంగా సరిపడా మందులు ఇవ్వడం జరిగింది. ఈ శిబిరంలో సుమారు 200 మంది పైగా ప్రజలు డాక్టర్ల చే వైద్య సేవలు పొందారు. ఈ సేవ యజ్ఞంలో గ్రామ శ్రీ వైద్య బృందం డాక్టర్ చేతన్,. వేణు,సత్యనారాయణ స్థానిక సేవా సమితి సభ్యులు దొంగరి సోమయ్య, కోనేటి వెంకన్న,కృష్ణ,అంతటి చంద్రకళ శ్రీనివాస్, జూలకంటి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు




భానుపురి /సూర్యాపేట టౌన్

ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల సూర్యాపేట యందు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ కె. సుజాత గారు ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ల్యాండ్ స్కేప్ డిజైనింగ్ బ్రాంచ్ లో ఇంకా 49 సీట్లు కలవని తెలియజేశారు. ఆసక్తి కలిగిన పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినిలు 8 వ తారీకు వరకు నేరుగా ప్రవేశం పోదుటకు అవకాశం కలదు, మరియు విద్యార్దినులకు హాస్టల్ వసతి కలదు. వివరాల కోసం 9866385292, 9394744491 సంప్రదించ వలసినదిగా తెలియజేశారు

## సూర్యాపేట చేనేత సంఘం డైరెక్టర్‌గా ముశం హరి ప్రసాద్ ఏకగ్రీవ ఎన్నిక



భానుపురి /సూర్యాపేట టౌన్

సూర్యాపేట జిల్లా చేనేత సహకార సంఘం డైరెక్టర్‌గా ముశం హరి ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు.చేనేత కార్మికుల సంక్షేమం కోసం ఎప్పుడూ కృషి చేసే హరి ప్రసాద్ ఎన్నిక పట్ల కార్మికులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా పలువురు ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. చేనేత రంగాన్ని మరింత అభివృద్ధి చేసి, కార్మికులకు మేలు చేస్తారని ఆకాంక్షించారు.

## శ్రీ వాసవి సేవా సమితి జాతీయ కౌన్సిల్ సభ్యులుగా డీజే మనోహర్ నియామకం

భానుపురి /వనపర్తి

శ్రీ వాసవి సేవాసమితి జాతీయ కౌన్సిల్ సభ్యులుగా కర్ణాటక రాష్ట్రం కోలార్ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త సేవా తత్పరులు డీజే మనోహర్ ను నియమించినట్టు శ్రీ వాసవి సేవా సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ పూరి సురేష్ శెట్టి తెలిపారు. ఈ సందర్భంగా డీజే మనోహర్ మాట్లాడుతూ నాకు జాతీయస్థాయిలో పదవి ఇచ్చినందుకు డాక్టర్ పూరి సురేష్ శెట్టి కి అభినందనలు తెలియజేస్తూ శ్రీ వాసవి సేవా సమితికి నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.



## చేనేత సహకార సంఘం డైరెక్టర్ సాయినేత

భానుపురి /సూర్యాపేట టౌన్



చేనేత పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్‌గా సాయినేత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఎలాంటి పోటీ లేకుండా సభ్యులందరి మద్దతుతో ఆయన ఎన్నిక కావడం చేనేత పారిశ్రామిక సహకార సంఘంలో ఆయనకు ఉన్న ఆమోదాన్ని ప్రతిబింబిస్తోంది .సాధారణంగా సహకార సంఘాల ఎన్నికలు వర్గపోరు, రాజకీయ పోటీకి వేదికగా నిలుస్తాయి. అయితే ఈసారి సభ్యుల మధ్య ఏకాభిప్రాయం నెలకొని ఎన్నుకోవడం విశేషం. సాయి నేత స్వర్గీయ మాజీ మంత్రి రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి, ఆయన తనయుడు రామ్ రెడ్డి సర్వోత్తమ రెడ్డి కి పిఆర్వో గా పని చేయుచున్నారు.

# ఆర్తితో కూడిన కావ్యం - మన అమ్మ జ్ఞాపకాలు




దుబ్బాకుల కృష్ణస్వామి
ప్రముఖకవి,చిత్రకారుడు
కిస్మత్ పూర్, రాజేంద్రనగర్.

లింగాల కవితా శ్రీనివాస్‌లికి సాహిత్యంపై, హిందూ ధర్మంపై, భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలపై ఎనలేని ప్రేమ. వీరికి కవులు, కళాకారులంటే చాలా ఇష్టం. కాబట్టే భానుపురి సాహితీ వేదిక ను ఏర్పాటు చేసి, ఎంతోమంది కవులను, కళాకారులను సన్మానించి గౌరవించారు. వీరిని ముఖాముఖి కలువలేదు కానీ, వాట్సప్ గ్రూపుల ద్వారా పరిచయమై, చాలా సమయం సాహిత్యం పై కూడా చర్చించేవారు. తన అమ్మ భర్తను కోల్పోయి, కటిక పేదరికంతో కాలాన్ని వెళ్ళదీస్తూ, పిల్లల భవిష్యత్తుకై ఎంత తపించిందో తెలిపే జీవనచిత్రం తన లేత వయసు మనోఫలకంపై చిరస్థాయిగా నిలిచిపోయేలా ముద్రవేసింది. ఇలాంటి సంఘటనలెన్నున్నాయో గాని, మంచి పట్టుదలతో చదివి, ఉపాధ్యాయుడయ్యాడు. అందుకే పెద్దలంటారు – కష్టాలే మానవుడు ఎదగడానికి సోపాన మని. శిల, శిల్పి చేతిలో ఎన్ని దెబ్బలు తింటే, అంతేరీతిలో అందరితోపూజలను అందుకుంటుంది గదా! చరిత్రలో ఉన్నత శిఖరాలను చేరిన వారి చరిత్రలిలాగే ఉంటాయి. వారి అనుభవమే ఉన్నత స్థాయికెదగడానికి దోహదపడేలా చేస్తుంది. మంచివారికి కష్టాలు ఎక్కువ వస్తాయి, ఆ కష్టాలనే, వారు తమ జీవితాన్ని తీర్చిదిద్దుకోవడానికి సాధనాలుగా మలుచుకుంటారు. శ్రీరాముడు, పాండవులు ఎంతగా కష్టపడ్డారో అందరికీ తెలిసిందే! ఇక పుస్తక విషయానికి వస్తే, ఆకర్షణీయమైనటువంటి ముఖచిత్రం, అందరికీ అందుబాటులో ఉండే ధర, విసుగు కలిగించని పేజీల సంఖ్య, పద్య కవిత్వం పై మమకారం ఏర్పడే విధమైన సాహిత్యం, పాఠశాలలో చదివే పిల్లలు నిత్యజీవితంలో పాడుకునే విధంగా సులభ శైలిలో రాసిన గేయాలు, పద్యాలు అత్యంత ఆకర్షణీయంగా ఉన్నాయి. నాకు నచ్చిన కొన్ని పద్యాలను ఇక్కడ ఉటంకిస్తున్నాను.

పిల్లలకు పెదవులను చూపిస్తూ, మాటలు నేర్పిస్తున్నట్లు ఎంత చక్కని పద్యమో చూడండి.

కనుజంట నెగరేసి కలుపగా పెదవుల మాయంచు
నమ్మంచు మరల మరల
తననాల్క పైదౌడ తాకంగ నాబల్కి
నాన్న నాన్నాయంటు నాన్న నేర్పె
దంతాలు నాల్కపై తట్టిస్తూ తాబల్కి
తాత తాతాయంచు తాత నేర్పె
పని గట్టుకొని మరీ పలికించె నా చేత గురువెవ్వరన
తొలి గురువె యమ్మ

పిల్లలు చిన్నప్పుడు రాత్రిళ్ళు ఎన్నోసార్లు ప్రక్కతడిపి, విరోచనాలు చేసినా.. మళ్లీ వెచ్చని బట్టలు వేసి పడుకో బెడుతుంది. నిద్ర లేకుండా ఓపికగా ఎంత సేవ చేస్తుందంటే, ఇతరులకది సాధ్యం కాదు. అందుకే తల్లి సహనంలో భూదేవి వంటిదని పెద్దలంటారు. ఆ పద్యం....

పలుమార్లు రాత్రులా ప్రక్క తా దడిపినా
లెక్కబెట్టక నీదు ప్రక్క మార్చు
మలమూత్రములు దీసి మంచాన్ని పొడిచేసి నిదుర
వదిలి వేసి నిన్ను జూచు
బాధలున్నను బైట పడనీక ప్రేమతో
శోకాన్ని దిగ మింగి సుధలు బంచు
తన రక్త మాంసాలు తనువుగా మనకొసగి
కనురెప్పలా జూచు కన్నతల్లి

శ్రీనివాస్ గారు తన తల్లి యొక్క ఆభరణాలను వర్ణించిన తీరును చూస్తే జగద్గురువు శ్రీ శ్రీ శ్రీ శంకరాచార్యుల వారు సౌందర్యలహరి లో అమ్మవారి అందాన్ని వర్ణించిన తీరు గుర్తుకు వస్తుంది.

పదమూడునేళ్ళైన ప్రక్కనే యున్నట్లు
నీ రూపు కళ్ళలో నిలిచెనమ్మ
పుత్తడాకులు నల్ల పూసలున్న గొలుసు
మురిసి నీ కంఠాన మెరిసెనమ్మ
చింతించ వలదంటు చెవి కమ్మలవిజేరి లి లిచెవిలోన
ముచ్చట్లు చెప్పెనమ్మ
పాదాలపై వ్రాలి ప్రస్తుతించెడి వెండి
కడియాలు నిను జేర గంటినమ్మ

తన చిన్ననాటి జీవితాన్ని కళ్ళకు కట్టినట్లు అద్భుతంగా చిత్రించిన పద్యం :

చేతిలో రూపాయి చిల్లరైనను లేదు
టీ సీ ని మేమెట్లు తీసుకోము

ఈ పద్యం నన్ను కంటతడి పెట్టించింది. టీ.సీ. తీసుకోవడానికి కూడా డబ్బులు లేని సమయంలో తన బిడ్డ ఎదగాలని ఉన్నత చదువులు చదవాలని ఎంత తపన పడిందో! నాటి మహనీయుడు శ్రీ లక్ష్మీనరసయ్య సార్ కూడా అంత ధన్యులయ్యారు. వారి ఉన్నతమైన మనసు వలన చరిత్రలో నిలిచిపోయారు. తన తల్లి తనకు బోధించిన నీతిని పద్య గీతిగా మార్చిన రీతి ప్రశంసనీయం.

అందమెందుకురయ్య ఆరోగ్యముండగా ఆస్తులెందుకు
మంచి దోస్తులుండ
బందు వర్గములెంత భగవంతుడే యుండ బాధపడకు
నాన్న భవిత నీదే

అంటూ పద్యంగా మార్చడం విశేషం.వీరి పద్యాలలో ప్రతిదీ చదివి తీరవలసిందే! తినబోతూ రుచులెందుకన్నట్లు నేను కొన్ని మాత్రమే ఉటంకించాను.

లిఉత్పల సత్యనారాయణాచార్య లి 2005 లో నా పుస్తకావిష్కరణ సభలో మాట్లాడుతూ – పెద్ద పెద్ద సమాసాలతో రాసే పద్యాలు, పాటల కంటే మంచి భావంతో పామరులకు అర్థమయ్యే విధంగా వ్రాసిన వారే నిజమైన కవి అన్నారు. నరసింహ శతక కర్త

చెరుకునకు వంకయైతేమి చెడునె తీపి అన్నారు. అక్కిరాజు సుందర రామకృష్ణ గారు తన నృహరీ పంచశతి లో మన తెలంగాణా మాండలికం, ఉర్దూ పదాలను అద్భుతంగా కందంలో చొప్పించారు. వెంట్రుకలున్నమ్మ ఏ కొప్పు వేసినా చక్కగానే ఉంటుంది అనే సామెత ద్వారా భావముంటే, ఏ చందస్సులోనైనా రాయవచ్చని నా అభిప్రాయం.

గంగిగోవు పాలు గరిటెడైనను చాలు అన్నట్లు, కొన్ని పద్యాలే ఐనా లింకశ్రీ ఈ కావ్యాన్ని చాలా ఆర్తితో వ్రాశారు.

ఈ కావ్యం లో నేను గమనించిన విశేషాలు :

సాహిత్య విలువ: అనుభవంనుండి పుట్టడం వలన ఈ కవిత్వానికి వన్నెతో పాటు నిజం తోడై ఉన్నది. నాటకీయత లేదు.

సామాజిక అవసరం: తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలలో వదిలేస్తున్న ఈ కాలంలో ఇలాంటి రచనలు సమాజానికి అద్దం పడతాయి. అమ్మ ఋణం తీర్చుకోవాలనే సత్యాన్ని నిత్యం గుర్తు చేస్తాయి.

కవిగా ఎదుగుదల:కష్టాన్ని కావ్యంగా మార్చుటలో బాధను శాపంగా కాకుండా పద్యాలు, గేయాలుగా మార్చి,గెలిచిన శ్రీనివాస్ సమాజానికి ఒక స్ఫూర్తి.

ఒక్క మాటలో చెప్పాలంటే ...ఇతడో కావ్యమై తన తల్లికి చేసిన పాదాభివందనంతో నాకు కళ్ళల్లో నీళ్ళు నిండాయి. ఇది చదివిన వారికీ కళ్ళు చెమర్చక మానవు. ఇంతటి చక్కని రచన సమాజానికి అందిస్తున్న వీరి జన్మ ధన్యమైనదని భావిస్తూ... ఇంకా వీరి కలం నుండి మరెన్నో రచనలు రావాలని కోరుకుంటూ, ఈ పుస్తకం ప్రతి ఇంటా ఉంటే బాగుంటుందని సూచిస్తూ, వీరికి హృదయపూర్వకంగా అభినందనలు తెలియజేస్తున్నాను.



సమీక్షకులు: దుబ్బాకుల కృష్ణస్వామి
ప్రముఖ కవి, రచయిత, చిత్రకారులు
కిస్మత్ పూర్, రాజేంద్ర నగర్.

# సూర్యాపేట ట్రాఫిక్ ఎస్సై సాయిరాం బదిలీ



భానుపురి /సూర్యాపేట టౌన్

సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న సాయిరాంను సీసీఎస్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ నరసింహ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో సీసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న యాదవేందర్ రెడ్డిని నూతన పట్టణ ట్రాఫిక్ ఎస్సైగా నియమించారు. ఈ బదిలీలను తక్షణమే అమలు చేసి, విధుల్లో చేరినట్లు కార్యాలయానికి నివేదికలు పంపాలని ఎస్పీ ఆదేశించారు. కాగా, పట్టణ ట్రాఫిక్ ఎస్సైగా సాయిరాం ట్రాఫిక్ నియంత్రణ కోసం అహర్నిశలు శ్రమించి అధికారులతో పాటు ప్రజల్లో కూడా ఎంతో మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలో పూర్తిస్థాయిలో అందించాలి

-జిల్లాలో ఖాళీగా ఉ fcన్న ఉపాధ్యాయుల, ఎంఈఓ పోస్టులు భర్తీ చేయాలి




భానుపురి/యాదాద్రి భువనగిరి

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించలని, ,ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించలని అనుమతులేని పాఠశాలలను ప్రైవేటు విద్యాసంస్థలకు కొమ్ముకాస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని, పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వేముల నాగరాజు, లావుడియ రాజులు డిమాండ్ చేశారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని ఎస్ఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముట్టడి చేశారు అనంతరం పరిపాలన అధికారి అంజిరెడ్డికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియ రాజు మాట్లాడుతూ ప్రభుత్వం జూన్ 15 నాటికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ తదితర సౌకర్యాలను అందజేస్తామని ప్రకటించింది. అయితే పాఠశాలలు ప్రారంభమై చాలా రోజులు గడిచినా ఇప్పటికీ విద్యార్థులకు యూనిఫాంలు పూర్తిస్థాయిలో అందలేదు. అలాగే మధ్యాహ్న భోజన పథకం అమలులో అనేక సమస్యలు కొనసాగుతున్నాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా నిధులు పెంచకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం కష్టంగా మారింది. అక్షయపాత్ర, ఇస్కాన్, మన్నా వంటి సంస్థల ద్వారా అందిస్తున్న భోజనం నాణ్యతపై కూడా పలు ప్రాంతాల నుండి ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మధ్యాహ్న భోజన పథకానికి తగిన నిధులు కేటాయించి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలి. జిల్లాలో గత 45 సంవత్సరాల క్రితం కట్టిన భవనాలు పూర్తిగా చేరినాయి వర్షాకాలం వాన కురిస్తే పూర్తిగా కూలి విద్యార్థుల మీద విద్యార్థుల మీద ప్రమాదం జరిగే అవకాశాలున్నాయి ప్రభుత్వం వెంటనే స్పందించి నూతన భవనాలు నిర్మించాలని, జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలి సుమారు ఒక పాఠశాలలో 30 మందికి ఒకటే టీచర్ ను కేటాయించడం సరికాదు , ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చాయి. పుస్తకాలు, నోట్‌బుక్స్, బెల్టులు, టైలు, షూలు, సాక్సులు తదితర వస్తువులను విద్యార్థులపై బలవంతంగా కొనుగోలు చేయిస్తున్నారు. పాఠశాలలకు ఆకర్షణీయమైన పేర్లు జోడించి ప్రచారం చేస్తూ నర్సరీ స్థాయి నుంచే లక్షలాది రూపాయల ఫీజులను వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించే ప్రత్యేక చట్టాన్ని వెంటనే అమలు చేయాలని కోరుతున్నాము, అదేవిధంగా రాష్ట్రంలోని సుమారు 27,000 ప్రభుత్వ పాఠశాలలను 4,000 పాఠశాలలుగా కుదించే ప్రతిపాదన ప్రభుత్వ విద్యా వ్యవస్థకు నష్టం కలిగించే ప్రమాదం ఉంది. కాబట్టి పాఠశాలల సంఖ్యను తగ్గించకుండా జనాభా ప్రాతిపదికన కొత్త ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేసి, ఇప్పటికే ఉన్న పాఠశాలలను బలోపేతం చేయాలని కోరుతున్నాము.. ,ప్రభుత్వ పాఠశాలలను మూసివేయకుండా జనాభా ప్రాతిపదికన కొత్త పాఠశాలలను ఏర్పాటు చేయాలి, ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి. ప్రభుత్వ పాఠశాలను ప్రభుత్వ పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేయాలని , రాష్ట్రంలో 27వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకు కుదించాలనే ఆలోచనను మానుకోవాలి.ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు అందించాలి.మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచి, అక్షయ పాత్ర, ఇస్కాన్, మన్నా సంస్థలకు కాకుండా మహిళా సంఘాలకు అప్పగించాలి.ఖాళీగా ఉన్న టీచర్, ఎంఈఓ , డీఈవో మరియు లెక్చరర్స్ పోస్టులను భర్తీ చేయాలి.ప్రైవేట్, కార్పోరేట్ విద్యావ్యాపారాన్ని అరికట్టి, ఫీజు నియంత్రణ చట్టం చేయాలి.విద్యాహక్కు చట్టం అమలు చేసి, పేద విద్యార్థులకు 25% ఉచిత ప్రవేశాలు కల్పించాలి.ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థలలో విచ్చలవిడిగా తెరిచిన పుస్తకాలు, యూనిఫామ్, నోట్బుక్ విక్రయ కేంద్రాలను మూసివేయాలి.పెండింగ్ స్కాలర్షిప్స్ మరియు ఫీజు రీయంబర్స్మెంట్ విడుదల చేసి జి.ఓ నెం: 7,8,9 లను రద్దు చేయాలి.ఇంటర్ కళాశాలలకు మధ్యాహ్న భోజన పథకాన్ని తక్షణమే ప్రారంభించి, నిధులు కేటాయించాలి.అద్దె భవనాలలో నడుస్తున్న పాఠశాలలు, హాస్టల్స్, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఈర్ల రాహుల్, సహాయ కార్యదర్శిలు తిగుల్ల శ్రీనివాస్, పుట్టల ఉదయ్, జిల్లా కమిటీ సభ్యులు నేహాల్,ప్రసన్న, ఉదయ్,అరవింద్,లత,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# దశాబ్దాల సమస్యకు తెర 9వ వార్డులో మురుగు కాలువలకు విముక్తి



-వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చర్యలు
-పూడిక తొలగింపు పనులకు శ్రీకారం చుట్టిన వార్డు కౌన్సిలర్ బండారు మంగమ్మ వెంకన్న స్థానికుల హర్షం

భానుపురి /సూర్యాపేట టౌన్

సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో గత పది సంవత్సరాలుగా పూడిక, చెత్తాచెదారంతో పూర్తిగా మూసుకుపోయి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న ప్రధాన మురుగు కాలువలను శుభ్రం చేశారు. వర్షాకాలంలో నీటి నిల్వ, దుర్వాసన, దోమల బెడదతో పాటు అంటువ్యాధుల ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో వార్డు కౌన్సిలర్ బండారు మంగమ్మ వెంకన్న ప్రత్యేక చొరవ తీసుకుని అధికారులతో సమన్వయం చేసి కాలువల పునరుద్ధరణ పనులను ప్రారంభింపజేశారు.9వ వార్డులోని 60 ఫీట్ రోడ్ సమీపంలోని ఫిల్టర్ బెడ్ నుంచి నల్లచెరువు వరకు విస్తరించి ఉన్న ప్రధాన డ్రైనేజీ కాలువలో భారీగా పేరుకుపోయిన పూడిక, మట్టి, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం కారణంగా నీటి ప్రవాహం పూర్తిగా నిలిచిపోయింది. దీంతో వర్షపు నీరు రోడ్లపై నిలిచి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతుండగా, పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఈ సమస్యను స్థానికులు ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ శాశ్వత పరిష్కారం లభించలేదు. ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచే ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్న వార్డు కౌన్సిలర్ బండారు మంగమ్మ వెంకన్న, ఈ కాలువ సమస్యను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని మున్సిపల్ అధికారులతో పలుమార్లు సమావేశమై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఆమె నిరంతర కృషి ఫలితంగా మున్సిపల్ సిబ్బంది జేసీబీ యంత్రాల సహాయంతో కాలువలో పేరుకుపోయిన పూడికను తొలగించే పనులను ప్రారంభించారు.ప్రస్తుతం ఫిల్టర్ బెడ్ నుంచి నల్లచెరువు వరకు కాలువను పూర్తిగా శుభ్రం చేసి నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించే పనులు వేగంగా కొనసాగుతున్నాయి. కాలువ పూర్తిగా శుభ్రం కావడంతో వర్షపు నీరు సాఫీగా వెళ్లే అవకాశం ఉండటంతో పాటు ప్రజలకు ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్



బండారు మంగమ్మ వెంకన్న మాట్లాడుతూ, ప్రజలకు ఇబ్బందులు కలిగించే ప్రతి సమస్యను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. వార్డును పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని, ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యకు పరిష్కారం దొరకడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ వార్డు కౌన్సిలర్ బండారు మంగమ్మ వెంకన్నకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.